క్లుప్తంగా

పనులను ప్రారంభించాలి

అన్నపురెడ్డిపల్లి: మండలానికి రెండో విడతలో మంజూరైన అమ్మ ఆదర్శ పనులను త్వరగా ప్రారంభించాలని ఎంపీడీఓ మహాలక్ష్మి అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ షబ్నా, ఎంఈఓ సత్యనారాయణ, ఐటీడీఏ ఏఈ సుబ్బరాజు, పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: అమ్మ ఆదర్శ పాఠశాలలు, పెండింగ్ పనులపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పెండింగ్ పనులను, కమిటీల ఏర్పాటును సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, సెర్ప్ వీఓలు, ఏపీఎం, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

పోడుదారులను ఇబ్బంది పెట్టొద్దు

చర్ల: పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులను అటవీశాఖాధికారులు ఇబ్బందులకు గురి చేయవద్దని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సూచించారు. గురువారం మండలంలోని దేవరాపల్లి, మామిడిగూడెం గ్రామాలలో పర్యటించిన ఆయన పోడుసాగుదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజనులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బూర్గంపాడు: పోడు భూముల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు.

టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్‌గా నాగెల్లి

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న నాగెల్లి వెంకట్‌ను బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నాగెల్లి వెంకట్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు నెలల వ్యవధిలోనే పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఏరియా ఉపాధ్యక్షుడిగా ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కాగా, కేంద్ర కమిటీ సభ్యులుగా మణుగూరుకు చెందిన ఇబ్రాయిల్, రమేశ్, మురళీ కృష్ణ, మస్తాన్, నాగేశ్వరరావులకు స్థానం దక్కిందన్నారు.

'మత్తు' జోలికి వెళ్లొద్దు

గుండాల: యువత రోజురోజుకు మద్యానికి డ్రగ్స్ కు అలవాటు పడి ప్రాణాలు కోల్పోతున్నారని, ఆ మత్తు విడనాడాలని గుండాల సీఐ రవీందర్ అన్నారు. గురువారం మండలంలోని గురుకుల పాఠశాల ఆవరణలో గంజాయి లాంటి మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, నూతన చట్టాలు, ఈవ్ టీజింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని అన్నారు ఈవ్ టీజింగ్ కి దూరంగా ఉండాలని విద్యార్థులకు తెలియజేశారు. అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతోనే మనుగడ

కరకగూడెం: మొక్కలతోనే మానవాళికి మనుగడ సాధ్యమని కరకగూడెం ఇంచార్జి ఎంపీడీఓ కుమార్ పేర్కొన్నారు. గురువారం కరకగూడెం జెడ్పీ పాఠశాలలో 'వనమహోత్సవం'కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మంజులా, ఉపాధ్యాయులు,పలు పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్ధాంతరంగా తొలగించారు..

ములకలపల్లి: గత 13 ఏళ్లుగా బీజేపీలో పనిచేస్తున్న తనను కనీస సమాచారం కూడా ఇవ్వకుండా పార్టీ మండల అధ్యక్ష పదవి నుంచి అర్ధాంతరంగా తొలగించారని అనుమల శ్రీనివాస్ వాపోయారు. ములకలపల్లిలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకులు పెండ్యాల వెంకట అప్పారావు, యర్రంశెట్టి శ్రీను, రంగారావు, గొర్ల రాజు, అత్యం సాయి, దమ్మపేట మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులు చేయించడం తగదు

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం విద్యార్థులతో పనులు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు హర్ష, విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. విద్యార్థి సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చినా పట్టించుకోకుండా పాఠశాల హెచ్ఎం విద్యార్థులతో పనులు చేయిస్తున్నారంటూ విద్యార్థి సంఘాలు ఖండించాయి.

నిరంతర వైద్య సేవలందించాలి

- సమస్యలపై నివేదిక ఇవ్వండి
- ఆస్పత్రి తనిఖీల్లో ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్: నియోజకవర్గానికి కేంద్రంగా ఉన్న మణుగూరు ఏరియా 100 పడకల ఆస్పత్రిలో నిరంతర వైద్యసేవలందించాలని, అవసరమైతేనే రిఫరీలు చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం 100 పడకల ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించిన ఆయన.. వైద్యులతో మాట్లాడి రోగులకు అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ కేంద్రంతో పాటు ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించి వైద్యుడు సునీల్‌ను ప్రధాన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకున్నారు. పలు సమస్యలు ఆయన దృష్టికి రాగా.. సమస్యలపై నివేదిక ఇవ్వాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. వైద్యులు



100 పడకల ఆస్పత్రిలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

సునీల్, గౌరీ, నర్సులు, సిబ్బంది కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, నాయకులు ఆవుల సర్వేశ్వరరావు, వెంకటప్పయ్య, జీవీ, సురేశ్ పాల్గొన్నారు.

మండలంలో సుడిగాలి పర్యటన

మండలంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం సుడిగాలి పర్యటన చేశారు. వాగు మల్లారం గ్రేస్ మిషన్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, దుస్తులు, బ్యాగ్, పెన్నులు, షూస్ పంపిణీ చేశారు. అనంతరం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాకు సమీపంలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. విగ్రహానికి పూలమాల వేసి ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. పద్మశ్రీ సకిని రామచంద్రయ్య దశదిన కర్మల కార్యక్రమం కూనవరంలోని తన నివాసంలో జరగ్గా, ఎమ్మెల్యే హాజరై సకిని రామచంద్రయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూనవరంలోని ఆశ వర్కర్ మడకం కృష్ణకుమారి, భర్త మడకం ఇర్మరాజు ఉదయం గుండెపోటుతో పరమపదించగా.. భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, ఎంపిటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, దొబ్బల వెంకటప్పయ్య, గాండ్ల సురేశ్, శివ, వల్లభనేని ఉపేందర్, పాయం నాగరాజు, పాతూరి వెంకన్న, దొడ్డపనేని మధు, బొజ్జ త్రిమూర్తులు, పాల్వంచ రాములు తదితరులు ఉన్నారు.

బొగ్గు గనులు వేలం వేయొద్దు



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

మణుగూరుటౌన్: కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల ప్రైవేటీకరణకు చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గురువారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం దుర్గం రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏరియా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సిల్వేరు గట్టయ్య మాట్లాడుతూ.. మోదీని కేడీగా అభివర్ణించారు. కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టేందుకు మోదీ ప్రైవేటీకరణకు పూనుకున్నారంటూ మండిపడ్డారు. నాయకులు రాములు, అబ్దుల్ రవూఫ్, జీవరత్నం, సంతోష్ చరణ్, రామారావు, భాగం రవి, యాకూబ్ పాషా, వివిధ గనుల ఫిట్ కార్యదర్శిలు మల్లికార్జున్, రాము, సురేశ్, రామకృష్ణ, దశరథ్ పాల్గొన్నారు.

'అల్లూరి'కి నివాళి

మణుగూరురూరల్: బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ ప్రాంతంలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించి 127వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు హాజరై అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలకు ఆకృత్యాలు, పెత్తందారి వ్యవస్థపై తిరుగుబాటు చేసి ప్రాణాలను అర్పించిన మహానీయుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షుడు ముత్యంబాబు, అడపా అప్పారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, నాయకులు వట్టం రాంబాబు, మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్, వల్లభనేని రమణ, ముద్దంగుల కృష్ణ, సురేష్, క్షత్రియ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం అందరికీ ఆదర్శనీయమని బీజేపీ మండల అధ్యక్షుడు మునిశెట్టి రామ్మోహన్‌రావు అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా అంబేడ్కర్ సెంటర్‌లోని అల్లూరి విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాగబాబు, వెంకన్న, వెంకటేశ్వర్లు, సుదర్శన్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రోశయ్య జయంతి



అశ్వారావుపేట: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

సాక్షి నెట్‌వర్క్: ఉమ్మడి ఏపీ దివంగత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండలాల్లోని పొట్టి శ్రీరాముల విగ్రహాలు, ఇతర ప్రాంతాల్లో రోశయ్య చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘాల బాధ్యులు మాట్లాడుతూ.. ఆర్థిక శాఖ మంత్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా సేవలందించి రోశయ్య మన్ననలు పొందారని అన్నారు.

దోమల మందు పిచికారీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామాలైన విప్పలగుంపు, కొడిశెలకుంటలలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మొదటి విడత దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వైద్యసిబ్బంది ఇంటింటిని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. నీరు నిల్వ ఉన్న కంటైనర్లను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, సుజాత, కౌసల్య, పద్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోగల గిరిజన మహిళా డిగ్రీ కళాశాల, అనంతారం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో గురువారం దోమల నివారణ మందు స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మధులిక మాట్లాడుతూ.. దోమల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, భాస్కర్, వెంకటేశ్వర్లు, విజయ్‌రెడ్డి, ఏఎన్ఎం విజయకుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామచంద్రయ్యకు నివాళి

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయితీకి చెందిన ప్రముఖ ఆదివాసీ డోలి వాయిద్య కళాకారుడు పద్మశ్రీ సకిని రామచంద్రయ్య ఇటీవలే అనారోగ్యంతో మరణించగా.. కుటుంబ సభ్యులు గురువారం ఆయన దశదిన కర్మలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు హాజరై సకిని రామచంద్రయ్య చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం బావికూనవరం గ్రామంలో మృతి చెందిన మడకం ఇర్మరాజు మృతదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. పరామర్శించిన వారిలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంబాబు, పట్టణ అధ్యక్షుడు అడపా అప్పారావు, సొసైటి చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా నాయకులు వట్టం రాంబాబు, కూనవరం మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్ తదితరులు ఉన్నారు.

దొడ్డి కొమరయ్యకు..

భద్రాచలంటౌన్: భద్రాచలం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయిధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని డివిజన్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల కోసం ఆయన పోరాడిన తీరును నాయకులు గుర్తు చేశారు.

సీఐని సస్పెండ్ చేయాలి

అశ్వాపురం: అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను వేధింపులకు గురి చేసిన సీఐ జితేందర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని మండల కేంద్రంలో మాల జనసమితి ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎస్సై శ్రీనివాస్‌పై కావాలని కక్ష పెట్టుకొని నిత్యం వేధింపులకు గురి చేస్తూ తోటి సిబ్బంది ఎదుట అవమానించాడని తెలిపారు. వెంటనే సీఐని విధుల నుంచి తొలగించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల జన సమితి నియోజకవర్గ అధ్యక్షుడు చెట్టి సురేష్, చెట్టి మల్లేష్, ఆదివాసీ జేఏసీ మండల అధ్యక్షుడు కల్లూరి నరసింహారావు, డేవిడ్, జూపల్లి ధ్రువ, వినోద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను ఆత్మహత్యాయత్నం చేసేలా వేధించిన సీఐ, కానిస్టేబుళ్లపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని దళిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి, కొద్దిసేపు రోడ్డుపై బైఠాయించారు.



అన్నపురెడ్డిపల్లి: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘం నాయకులు

దళిత ఎస్సై ఆత్మహత్య యత్నానికి వేధింపులే కారణమని, వేధింపులకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజన ఉద్యోగులకు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా రమేష్, ఇనపనూరి రాంబాబు, రుంజా శ్రీనివాసరావు, చల్లా పుల్లయ్య,యాదాల వెంకన్న, చల్లా రాంబాబు, నీలం వెంకటేశ్వర్లు, కళాధర్, నాగబాబు, జమలయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ముత్యాలరావు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ముత్యాలరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఇంతకాలం చర్ల ఎంపీడీఓ ఈదయ్య ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న ముత్యాలరావు ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. ముత్యాలరావును కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కలిసి అభినందనలు తెలియజేశారు.

నోట్‌పుస్తకాల పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం చిన్న అరుణాచల ఆలయ వ్యవస్థాపకుడు శివనాగ స్వామి అరుణాచలం సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం విద్య అనుగ్రహం కింద విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. మండలంలోని సింగారం, పాత మారేడుబాక, కొత్త మారేడు బాక, పెదపాడు, వైట్ నాగారం, నరసాపురం గ్రామాల్లోని ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు అందజేశారు.

భద్రాద్రిలో కలపండి

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజక వర్గం నుంచి విడిపోయిన ఐదు పంచాయతీలను తిరిగి కలపాలని గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆయన స్వగృహంలో ఆయా గ్రామాల ప్రజలు వినతి అందజేశారు. ఇరు రాష్ట్రాల ముఖ్య మంత్రుల సమావేశం ఉండడంతో ఐదు పంచాయతీలను భద్రాచలం మండలంలో కలిపే విధంగా చర్యలు తీసుకోవాలని వారు మంత్రిని కోరారు.

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి

ములకలపల్లి: మండల పరిధిలోని జగన్నాథపురంలో నూతనంగా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ సున్నం నాగమణి వైద్యశాఖ అధికారులను కోరారు. జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన గురువారం కొత్తగూడెంలో జరిగిన విద్య, వైద్య అనుబంధ సంఘాల సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని కోరారు.

ఆర్థిక సాయం

బూర్గంపాడు: వేపలగడ్డ గ్రామానికి చెందిన బొర్రా రాజు డయాలసిస్‌తో బాధపడుతుండగా.. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. విషయం తెలిసిన మోరంపల్లిబంజర చేయూత ట్రస్ట్ ఆర్థిక సాయమందించింది. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, ట్రస్ట్ ప్రతినిధులు కైపు నాగిరెడ్డి, జక్కిరెడ్డి మల్లారెడ్డి, కొంద్రు వెంకటేశ్వర్లు, గాదె నర్సిరెడ్డి, శనగ మల్లేశ్వరరావు, తమ్మినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన జరుపుకోవాలి

దుమ్ముగూడెం: ఎమ్మార్పీఎస్ అవిర్భావ దినోత్సవాన్ని గ్రామాగ్రామానా నిర్వహించాలని ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి అలవాల రాజా పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని నరసాపురం గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ, గ్రామాన మాదిగ జాతి ఆత్మ గౌరవ పతాకలను ఎగరేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పుల తిరుపతి, కొప్పుల మల్లూరు, ఎంఎంఎస్ జిల్లా అధికార ప్రతినిధి తెల్ల సమ్మక్క, ఉపాధ్యక్షురాలు కొచ్చర్ల కుమార్, కార్యదర్శి కొప్పుల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

దుమ్ముగూడెం: జిల్లా రైతు సంఘం రెండో మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రవికుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కిలిమి ఎల్లారెడ్డి, రైతు సంఘం నాయకులు బొల్లోజు వేణు, తాటిపూడి రమేష్, కోర్స రమేష్, పాయం కోటేష్ తదితరులు ఉన్నారు.

బంద్ విజయవంతం

దమ్మపేట: నీట్ ప్రశ్నాపత్రం లీకు కారణంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఈ నెల 6న నిర్వహించనున్న నీట్ కౌన్సెలింగ్‌ను వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. లీక్ అయిన నీట్ పరీక్షను రద్దుపరచి, ఆ పరీక్షను తిరిగి నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు విద్యా సంస్థలు స్వచ్ఛందంగానే బంద్‌కు సహకరించి, విద్యా సంస్థలను మూసివేశారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఎఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ములకలపల్లి: నినాదాలు చేస్తూ వస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులు, నాయకులు



అన్నపురెడ్డిపల్లి: పాఠశాలను బంద్ చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు



చండ్రుగొండ: జెడ్పీ పాఠశాల హెచ్ఎంకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



అశ్వారావుపేట: బంద్ పాటిస్తున్న విద్యార్థులు



ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మణుగూరురూరల్: పట్టణంలోని మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో రాజనీతిశాస్త్రం ఒకటి, ఇంగ్లీష్ ఒకటి, తెలుగు ఒకటి, కంప్యూటర్ సైన్స్ లేదా కంప్యూటర్ అప్లికేషన్స్ ఒకటి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా పోస్టులను తాత్కాలిక పద్ధతిన నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. పోస్టులకు దరఖాస్తు చేసుకునే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సంబంధిత పీజీలో 50శాతం మార్కులు కలిగి ఉన్నవారే అర్హులన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్, అనుభవం ఉన్న అధ్యాపకులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆయా అధ్యాపక పోస్టులకు ఈ నెల 9వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మరుసటి రోజు 10వ తేదీన ఇంటర్వ్యూలు చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంట తీసుకురావాలని తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు..

మణుగూరురూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో రెండో విడత ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ బి.ప్రభాకర్ తెలిపారు. గురువారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ... 2024–25 విద్యాసంవత్సరానికి గానూ ఆయా కళాశాలల్లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్,మెకానికల్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెన్స్(కోపా)లలో ప్రవేశాల కోసం విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోగా సంబంధిత ధ్రువపత్రాలతో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు www.ititelangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 9440206990 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి

అశ్వారావుపేట: వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలను గురువారం అశ్వారావుపేటలో మున్నూరు కాపుసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రింగ్ సెంటర్‌లో జయంతి కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల సూర్యప్రకాశరావు, తాడేపల్లి రవి, కురిశెట్టి నాగబాబు నాయుడు, బండారు సాయిచంద్, సంగీతం బుల్లెయ్య, కోరశిక రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నివాళి..

మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో వంగవీటి మోహనరంగా విగ్రహానికి పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పూలమాల అలంకరించి నివాళులర్పించారు. వంగవీటి మోహన రంగా ఘనతను ఆయన కొనియాడారు.

అశ్వారావుపేటరూరల్: మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో గురువారం అశ్వారావుపేట, నారాయణపురం గ్రామంలో వేర్వేరుగా వంగవీటి రంగా జయంతి వేడుకలను నిర్వహించారు. అశ్వారావుపేటలోని పాత ఎంపీడీఓ కార్యాలయంలో వద్ద కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. అలాగే ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయగా.. నారాయణపురం గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, సంఘం బాధ్యులు సంగీతం బుల్లయ్య, యూఎస్ ప్రకాశ్‌రావు, తాడేపల్లి రవి, కొట్టే శ్రీనివాసరావు, మద్దాల నాగేశ్వరరావు, పాశం రామారావు, కురిశెట్టి నాగబాబు, బండారు చందు, దత్తు పాల్గొన్నారు.

రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ

అశ్వాపురం: మండలంలో నెల్లిపాక, అశ్వాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల మహాజన సభలు గురువారం సంఘం కార్యాలయాల్లో నిర్వహించారు. రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయాలు సేకరించారు. 10 ఎకరాలకు రైతుభరోసా ఇవ్వాలని మహాజన సభల మెజార్టీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానం చేశారు. సభల్లో ఎంపీపీ ముత్తినేని సుజాత, ఏడీఏ తాతారావు, ఏఓ సాయిశంతన్‌కుమార్, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, అశ్వాపురం పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు గాదె వెంకటరెడ్డి, ఎంపీటీసీ కమటం నరేష్, పీఏసీఎస్‌ల డైరెక్టర్లు, సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: స్థానిక రైతు వేదిక ఆవరణలో గురువారం రైతు భరోసా పథకం అమలుపై ఏడీఏ అఫ్జల్ బేగం ఆధ్వర్యంలో మహాజన సభ నిర్వహించారు. సభకు హాజరైన రైతుల్లో కొంత మంది బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రైతు బంధు పథకాన్ని అమలు చేయాలని కోరగా, మరికొంత మంది రైతులు పథకాన్ని అమలులో జాప్యం కోసమే అభిప్రాయ సేకరణ పేరుతో కాలయాపన చేస్తున్నారని అధికారులను విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ అఫ్జల్ బేగం

మరికొంత మంది రైతులు సాగులో ఉన్న ప్రతి ఎకరాకు పథకాన్ని అమలు చేయాలని, ఐటీ రిటన్స్ నిబంధనలను తొలగించాలని కోరారు. ఇదే విధంగా మండలంలోని నారాయణపురం గ్రామంలోని రైతు వేదికలో కూడా మహాజన సభ నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, మానిటరింగ్ ఆఫీసర్ సోమయ్య, సొసైటీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, నిర్మల పుల్లారావు, మాజీ సొసైటీ అధ్యక్షులు మొగళ్లపు చెన్నకేశవరావు, ఏవో నవీన్, సీఈవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో గురువారం మాస శివరాత్రిని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు సత్యనారాయణశర్మ, సాయి మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా అత్యంత వైభవంగా జరిపించారు. స్వామి వారి కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండ ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.